క్లుప్తంగా

పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ



ర్యాలీకి హాజరైన చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

యర్రగొండపాలెం: పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని వై.కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎ.పద్మ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావ్, ఏఎన్ఎం జి.వీరమ్మ, కార్యకర్తలు జి.నాగమల్లేశ్వరి, పద్మ, షేక్ శంషాద్, రూత్‌మేరి, నసీమా, రామసుబ్బమ్మ, రాంకుమారి, విజయలక్ష్మి, తిరుపాలమ్మ, రేణుక, కోటేశ్వరి, రమణ, అంజమ్మ, చంద్రావతి, పార్వతి పాల్గొన్నారు.

దొనకొండలో జోరు వర్షం



దొనకొండలో పడుతున్న వాన

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. మెట్ట పైర్లు ఈ వర్షంతో జీవం పోసుకున్నాయి. వర్షం లేక అల్లాడుతున్న రైతులకు ఈ వాన కొద్ది ఉపశమనం కలిగించింది. గ్రామాల్లోని పొలాలకు ఎరువులు వాడేందుకు చర్చించుకుంటున్నారు. మిరప, పత్తి, పొగాకు పంటలకు వర్షం శ్రేష్టకరమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు లాయర్‌ను కలిసిన బాధితులు



పొన్నవోలుతో దేకనకొండ యువకులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామానికి చెందిన పలువురు హైకోర్టు లాయర్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి నికలిసి న్యాయం కోరారు. ఇటీవల మండలంలోని దేకనకొండలో జరిగిన అల్లర్లలో బాధితులైన అన్నెం కృష్ణారెడ్డి, మూర్తల బ్రహ్మరెడ్డి, పడిగపాటి చంటి, అన్నెం శివారెడ్డిలు ఆయన్ను కలిసి రిమాండ్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, వీలైనంత త్వరగా బెయిల్ మంజూరు చేయించాలని, పొలాలు బీడ్లు పడుతున్నాయని వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన పొన్నవోలు తనకు చేతనైనంత సహకరిస్తానని, బెయిల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

పుల్లలచెరువు: మండలంలోని అక్కపాలెం తండాలో వినాయక చవితి సందర్భంగా టీడీపీ కార్యకర్తలు దాడి చేయగా గాయపడిన బ్రాహ్మం నాయక్, వాలీబాయ్ కుటుంబానికి స్థానిక శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. నగదును బాధితునికి శుక్రవారం యర్రగొండపాలెం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, రమణారెడ్డి, నాయకులు రోసిరెడ్డి, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

హామీలన్నీ తూచ్!



దర్శి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి (ఫైల్)



అధ్వానంగా ఉన్న వై.పాలెం-పుల్లలచెరువు రోడ్డు

కూటమి ప్రభుత్వం పనితీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా సూపర్‌సిక్స్ సంగతి అటుంచి స్థానికంగా టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలన్నీ నీటి మీద రాతలుగా మిగిలాయి. దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్‌లు గెలిచినా ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా ఓడిన టీడీపీ అభ్యర్థులు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబులకే ప్రాధాన్యం ఇస్తోంది. ఆ ఇద్దరు నేతలు ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో స్థానికంగా కనీసం ఒక్క హామీని కూడా అమలు చేసిన దాఖలాలు లేవు.

- కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల పెదవి విరుపు
- హామీలను గాలికొదిలిన దర్శి, వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జిలు
- హంగు ఆర్భాటాలకే ప్రాధాన్యం

దర్శి/యర్రగొండపాలెం: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా స్థానికంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దర్శి అభివృద్ధే తన ధ్యేయమని పదే పదే జపం చేసే గొట్టిపాటి లక్ష్మి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దర్శి ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తామన్నారు. ఈ 100 రోజుల్లో ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇంటర్ నేషనల్ డ్రైవింగ్ స్కూల్ అధికారంలోకి రాగానే పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధులు కేటాయించామని చెప్పారేగానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. నియోజకవర్గానికి సాగునీరు, తాగునీరు లేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ డ్యాంలో నీళ్లు ఉన్నా సాగు నీరిస్తామని చెప్పించడం చేతకాలేదు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీళ్లు ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఆ పనులు ముందుకు సాగడం లేదు. తాళ్లూరులో మొగళిగుండాల చెరువు అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఆ ఊసే ఎత్తడం లేదు. పెద ఉయ్యాలవాడలో రాక పోకల కోసం మూసీ నదిపై వంతెన నిర్మిస్తామని చెప్పి అటువైపు అడుగులు కూడా వేయలేదు. గుండ్లకమ్మ ఎగువ నీటిని మల్కాపురం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసుకుని ముండ్లమూరు, తాళ్లూరుకు నీళ్లు అందిస్తామన్నారు. అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడం గమనార్హం. దొనకొండ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పదే పదే చెప్పారు. ఆ వైపు అడుగులు కూడా పడలేదు. దర్శికి మహర్దశ తీసుకొస్తామని చెప్పారేగానీ ఇక్కడ ఉన్నవాళ్లు కూడా భయపడి నియోజకవర్గం వదిలి పారిపోయేలా దాడులు మాత్రం చేయిస్తున్నారు. నిత్యం ఇక్కడ ఇసుక దోపిడీలు, దాడులు పెంచి పోషించడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

హడావుడి తప్ప అభివృద్ధి శూన్యం

ఆమె చేసిన అభివృద్ధి ఏమీ లేదుగానీ హడావుడికి మాత్రం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తనకు సంబంధం లేని ప్రభుత్వ కార్యాలయాల్లో హల్‌చల్ చేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తానే ఎమ్మెల్యే అన్నట్లుగా ఫైళ్లు చెక్ చేయడం వంటి పనులు చేస్తోంది. అధికారులు సైతం ఆమెకు ఎదురు చెప్పే ధైర్యం లేదు. నియోజకవర్గంలోని పోలీస్ వ్యవస్థ నుంచి రెవెన్యూ, ఎక్సైజ్, ఇతర ఏ శాఖల అధికారులైనా ఆమె చెప్పినట్లు వినేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసి తన ఆర్భాటాన్ని కొనసాగిస్తోంది.

అటకెక్కిన ఎన్నికల హామీలు

యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో చేసిన హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెసిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్నా సమస్యలపై మాత్రం దృష్టి సారించలేదు. డివిజన్ కేంద్రం మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేస్తామని, దీంతో యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరిపోతాయని ఊక దంపుడు ప్రసంగాలను చేశారు. వెలిగొండ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి నీరు విడుదల చేస్తామని, పెద్దదోర్నాల మండలంలో ఉన్న తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు, త్రిపురాంతకం మండలం దూపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ల నుంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటలు ఇప్పుడు వినిపించడం లేదు. త్రిపురాంతకం నుంచి త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం రోడ్డులో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువపై ఉన్న సింగిల్ బ్రిడ్జి స్థానంలో డబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని, యర్రగొండపాలెం-త్రిపురాంతకం, పుల్లలచెరువు-యర్రగొండపాలెం రోడ్లను అభివృద్ధి పరుస్తామని చేసిన వాగ్దానాలు టీడీపీ నాయకులు మరచిపోయారు. టీడీపీ అమలు పరుస్తామన్న సూపర్ సిక్స్ పథకాల కోసం నియోజకవర్గ ప్రజలు ఎదురు చూసి ఇది చంద్రబాబు మార్క్ అంటూ.. వ్యంగ్యంగా చర్చించుకోవడం గమనార్హం.



రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ఎన్ఎస్‌పీ కాలువపై ఉన్న సింగిల్ బ్రిడ్జి

ఎమ్మెల్యే బూచేపల్లికి అభినందనలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి మండల ప్రజలు అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహాలతో పార్టీకి జవసత్వాలు వచ్చినట్లేననే భరోసా జగన్‌మోహనరెడ్డి కల్పించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేస్తారని, ప్రతి కార్యకర్తకు కొండంత అండగా నిలిచి పార్టీని ఉన్నత శిఖరాలకు చేర్చుతారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు



దొనకొండ: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పోటీలకు మండలం నుంచి అన్ని పాఠశాలల విద్యార్థులు 350 మంది హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. శనివారం అథ్లెటిక్స్, షటిల్, యోగా, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కాలే నరసింహారావు తెలిపారు.

పుల్లలచెరువు: విద్యార్థులకు క్రీడా పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈవో శామ్యూల్ జాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. లాంగ్‌జంప్, ఖోఖో, హైజంప్, అనేక రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై మక్కువ పెంచుకోవాలని కోరారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో ఎంపిక చేస్తామని చెప్పారు. హెచ్ఎం వరప్రసాద్, పీడీ హూనేనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో శామ్యూల్ జాన్

ఎంపీపీ పాఠశాలలో నాటిన మొక్కలు



మొక్కలు నాటుతున్న ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: మండలంలో తంగిరాలపల్లి పంచాయతీ తమ్మడపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవం సందర్భంగా శుక్రవారం మొక్కలు నాటారు. అదే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు గోసు వెంకటసుబ్బారావు రూ.10 వేల విలువైన మొక్కలు అందజేశారు. ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మొక్కలు పెంచడంతో పర్యావరణ పరిరక్షణ సాధించవచ్చన్నారు. మొక్కలు నాటడంతో సరిపోదని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆరోగ్యవంతమైన వాతావరణానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని, కాలుష్య రహిత సమాజానికి మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు జింకా నరసింహారావు, సుధాకర్, ఉపాధ్యాయులు రసూల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉరకెత్తి దెబ్బతింటున్న మొక్కలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేకి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండు ముఖం పట్టడంతో అధికారులు వాటిని శుక్రవారం పరిశీలించారు. సాగర్ జలాలు విడుదలై పంట పొలాల్లో నీరు నిల్వ ఉంచడంతో మొక్కల పాదుల్లో నీరు నిలిచి ఉరెకెత్తి వాటి రంగు మారి వాడు ముఖం పట్టాయి. మండలంలోని రాజుపాలెం, సోమేపల్లి గ్రామాల పరిధిలో నేషనల్ హైవేకి ఇరువైపులా గతేడాది పాదుపు గ్రూపుల మహిళలతో మొక్కలు నాటి వాటిని పెంచారు. మొక్కలు బతికి ఏపుగా పెరిగాయి. ఇటీవల సాగర్ నీరు విడుదల కావడంతో రైతులు వరిపంటను సాగు చేస్తున్నారు. దీంతో నీరు అధికంగా నిల్వ ఉండటంతో మొక్కలు నాటిని పాదుల్లో నీరు నిలిచి ఉరకెత్తి రంగు మారి మాడిపోతున్నట్లు అధికారులు గుర్తించారు. మొక్కల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్న దానిపై చర్చించారు. మండల వ్యవసాయాధికారి కె.నీరజ, వెలుగు ఏపీఓ కృపమ్మ, సీసీ ఆంజనేయులు, నాగయ్య ఉన్నారు.



నీటి కొరతతో దెబ్బతింటున్న మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

250 మందికి కంటి పరీక్షలు

ముండ్లమూరు (దర్శి): స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం దర్శికి చెందిన గర్నెపూడి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి సమస్యతో బాధపడుతున్న 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఒంగోలు కిమ్స్ హాస్పటల్ సహకారంతో ఏర్పాటు చేశామని నిర్వాహకులు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏంఈఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, కంటి వైద్యాధికారులు బి.రామాంజనేయులు, రాణిలు పరీక్షలు నిర్వహించారు. పీఆర్‌ఓ గురవయ్య, సిబ్బంది మహేష్, రోజా, వసంత, తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టివేత

బేస్తవారిపేట: స్థానిక పట్టణంలోని పలు దుకాణాలను ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వాగిచర్ల మహేష్ గృహంలో రూ. 11,149, బీ శివశంకర కోటేశ్వర రావు షాపులో రూ.15,747, ఎం సత్యనారాయణ దుకాణంలో రూ.17,785 విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బాణసంచా అమ్మినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అర్థవీడులోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన రూ.60,500 దీపావళి మందులను ఎస్సై సుదర్శన్‌యాదవ్ స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. లైసెన్స్ తీసుకోకుండా దీపావళి మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

పుల్లలచెరువు: పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందించడం అభినందనీయమని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర అన్నారు. మార్కాపురానికి చెందిన రిటైర్ ఉపాధ్యాయుడు, దేశ ప్రధానితో సన్మానం అందుకున్న రామ్‌భూపాల్‌రెడ్డి తన సొంత డబ్బులతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీల్లోని పది, ఇంటర్‌లో గత ఏడాది పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండో స్థానాలు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం పుల్లలచెరువు కేజీబీవీ పాఠశాలల్లోని పది, ఇంటర్‌లో మొదటి, రెండు ర్యాంకులు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ రామ్‌భూపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి, ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. రామ్‌భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఉపాధ్యాయుడిగా పనిచేశానని, చదువుకునే విద్యార్థులంటే తనకు ఎంతో ఇష్టమని, విద్యార్థులకు ఏదో చేయాలనే తపన ఉండటంతో ఇలా చేస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం రామ్‌భూపాల్‌రెడ్డిని ఎంఈవోలు, ప్రిన్సిపాల్ లీల్లీప్రకాశ్‌వాణి, ఉపాధ్యాయులు సన్మానించారు.



జ్ఞాపికలు, ప్రశంసపత్రాలతో కేజీబీవీ విద్యార్థినులు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

- ఎంపీపీ గుమ్మా పద్మజ

పెద్దదోర్నాల: వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చుకుని అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. దీంతో పాటు గత వేసవిలో తీవ్ర నీటి ఇబ్బందులు ఏర్పడిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో నీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు. భారీగా వర్షాలు కురిసినా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో బోర్లు రీచార్జి కాలేదని, దీని వల్ల నీటి ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గుమ్మా పద్మజ

భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

కురిచేడు: మండలంలోని కల్లూరు భూవివాదంలో ఇరువర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ జరిగింది. వివరాలు.. పోలెబోయిన పెద్ద పెద్దయ్య, ఆయన బంధువులు నక్కా చిన్న వెంకటేశ్వర్లు, లక్ష్మిల మధ్య చాలాకాలంగా భూ వివాదం జరుగుతోంది. ఒకరిపై ఒకరు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇంతవరకు దానిపై రెవెన్యూ అధికారులు తేల్చలేదు. శుక్రవారం ఆ విషయంపై తహసీల్దార్ రజనీకుమారి.. పెద్ద పెద్దయ్యను పిలిపించి మాట్లాడారు. తిరిగి గ్రామానికి వెళ్లిన పెద్దయ్యపై నక్కా చిన్న వెంకటేశ్వర్లు వాగ్వాదానికి దిగి దుర్భాషలాడాడు. ఇంటికి వెళ్లిన పెద్దయ్య వద్దకు నక్కా చిన్నవెంకటేశ్వర్లు, కొండలు, వెంకట్రావు, ఆంజనేయులు, మరో పెద్దయ్య, సాయిరాంలు వెళ్లి గొడవపడి అడ్డు వచ్చిన పోలెబోయిన వెంకట సుబ్బారావును కొట్టారు. నక్కా నారాయణమ్మ, లింగమ్మ, లక్ష్మీదేవిలు కారం పొట్లాలు తీసుకుని తమపైకి దాడికి వచ్చారని పెద్దపెద్దయ్య ఆరోపించారు. తమను చంపుతామని బెదిరిస్తున్నాడని పెద్దయ్య పేర్కొన్నాడు. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది వెంకటప్పయ్య, యోహాను, రెహమాన్, బాషాలు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంకట సుబ్బారావుకు గుండెకు సంబంధించిన వ్యాధి ఉండటంతో మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

25న చెకుముకి టాలెంట్ టెస్టు

కొమరోలు: జనవిజ్ఞాన వేదిక, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ సౌజన్యంతో ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు ఈనెల 25వ తేదీ నిర్వహిస్తున్నట్లుగా మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం ఎంఈవో వెంకటరత్నం, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు అల్లూరయ్య, రాష్ట్ర కార్యదర్శి విశ్వరూపాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 25వ తేదీ పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.